చలో ఢిల్లీకి కదలండి

- కార్మిక, కర్షక శక్తి ఏకం కావాలి
- మోడీ సర్కార్ దుర్మార్గాలను ప్రజలకు వివరించండి
- ఏప్రిల్ 5న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయండి
- సిఐటియు, రైతుసంఘం, వ్య.కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సులో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న విజ్జు కృష్ణన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మికులు, కర్షకులు ఏకమై ప్రజాక్షేత్రంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పలువురు వక్తలు అన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద రాష్ట్ర స్థాయి సదస్సు ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, ఆలిండియా అగ్రికల్చరల్ వర్కర్స్ యూనియన్ (ఎఐఎడబ్ల్యుయు) జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎమ్ సాయిబాబు ప్రధాన వక్తలుగా మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయాలేదని చెప్పారు. నేషనల్ క్రైం బ్యూరో రికార్డ్స్ ప్రకారం అధికారికంగా దేశంలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు వంటి వారి ఆత్మహత్యలు రికార్డుల్లోకి ఎక్కలేదనీ, అవి ఇంతకు రెట్టింపు ఉన్నాయని వివరించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోడీ ఇప్పుడు ఆ ప్రస్తావన కూడా తేకుండా, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే మూడు నల్ల చట్టాలను తెచ్చే ప్రయత్నం చేశారని వివరించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఆ నల్లచట్టాల్ని వెనక్కి తీసుకోక తప్పలేదనీ, ఇప్పుడు వాటిని మరో రూపంలో అమల్లోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. సుదీర్ఘకాలం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని గుర్తుచేశారు. సంపద సృష్టికర్తలైన కార్మికులు, కర్షకులు, వ్యవసాయకూలీలపై కేంద్ర ప్రభుత్వం యుద్ధం చేస్తోందనీ, దేశాన్ని బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నాలను ఆమోదించబోమని హెచ్చరించారు. నిరర్థక ఆస్తులు (ఎన్పీఏ) పేరుతో కార్పొరేట్లకు రూ.10 లక్షల కోట్ల రుణాలను కేంద్రం రద్దుచేసిందన్నారు. విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టబోమని హామీ ఇచ్చిన మోడీ సర్కారు ఇప్పుడు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్ల అనుకూల విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వం డబుల్ ఇంజిన్ పేరుతో అదానీ, అంబానీల సేవలో తరిస్తున్నదని అన్నారు. ఇప్పుడు వారి దృష్టి దేశంలోని ప్రకృతి సహజ సంపదపై పడిందనీ, అడవులను కూడా వారికి కట్టబెడుతున్నారని చెప్పారు. సదస్సుకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అధ్యక్షత వహించారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ, చలో ఢిల్లీ కార్యాచరణను వివరిస్తూ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు తీర్మానాన్ని బలపరిచారు. అనంతరం సభికులు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ఎఐకెఎస్ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ రమ, పద్మ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రజిత తదితరులు పాల్గొన్నారు.

ఇదీ కార్యాచరణ

- ఫిబ్రవరి 10వ తేదీ లోపు జిల్లా సదస్సులు
- ఫిబ్రవరి 28లోపు మండల స్థాయి సదస్సులు
- మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు గ్రామస్థాయిలో పాదయాత్రలు
- మార్చి 10 నుంచి 25 వరకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జీపు, బస్సు జాతాలు

త్వరలో మూడు జిల్లాల కలెక్టరేట్లు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ చేతుల మీదుగా ఈ నెలలో మరో మూడు సమీకృత జిల్లా కలెక్టరేట్లు ప్రారంభం కానున్నాయి. జనవరి 12న ఉదయం మహబూబాబాద్ జిల్లా నూతన కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ప్రారంభించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఖమ్మం జిల్లా నూతన సమీకృత జిల్లా కలెక్టరు కార్యాలయాన్ని జనవరి 18న ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రారంభించనున్నారు.

సబ్సిడీ బియ్యం ఎత్తివేయడం తగదు

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సబ్సిడీ బియ్యం ఎత్తివేయడం రాజ్యాంగ హక్కును కాలరాయడమేనని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. హైదరాబాదులో ఆదివారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరికీ కూడు గుడ్డ నివాసం అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉందని చెప్పారు. సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేయడం అంటే ఆహార భద్రత చట్టంతో పాటు నిరుపేదలు జీవించే హక్కును హరించడమేనని చెప్పారు. డబ్ల్యుటిఒ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు షరతులను మోడీ ప్రభుత్వం యధావిధిగా అమలు చేస్తోందని తెలిపారు. పేదలకు అందించే సబ్సిడీల నుంచి ప్రభుత్వాలు తప్పుకోవాలనే షరతును యధావిధిగా అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడిందని వివరించారు. తెల్ల రేషన్ కార్డు ఆధారంగా బతుకుతున్న కోట్లాదిమంది నిరుపేదల కుటుంబాలను ఆత్మహత్యల వైపు పురికొల్పే ప్రమాదం ఉందన్నారు.

ఎంఆర్ఓ,ఎండీఓ కార్యాలయాల ముందు నిరసనలు

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం యధావిధిగా అమలు చేసే ఆలోచన నుండి వెనక్కి తగ్గాలనీ, సబ్సిడీ బియ్యాన్నీ, ఉచిత బియ్యాన్ని యదాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమ, మంగళవారాల్లో ఎంఆర్ఓ, ఎండీఓ కార్యాలయాల ముందు నిరసనలు చేపట్టాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు పిలుపునిచ్చారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షత వహించారు

నిఖత్ జరీన్‌కు రేవంత్ అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌ను పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి సన్మానం చేశారు. జరీన్‌కు కాంగ్రెస్ పార్టీ తరుపున రూ. ఐదు లక్షల బహుమతి ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నిజాంక్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. జరీన్ సాధించిన విజయాన్ని గౌరవిస్తూ బహుమతి ప్రకటించామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఇందులో ఎలాంటి ఇతర ఉద్దేశాలు లేవని చెప్పారు. రాజకీయాల్లోనూ క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేయాలని, 26లోగా గ్రూప్1 ఆఫీసర్‌గా నిఖత్ జరీన్‌ను నియమించాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. నిఖత్ జరీన్ మాట్లాడుతూ తనకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ తనకు బహుమతి ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. అందరి మద్దతుతో దేశం గర్వించేలా ఆట తీరు కనబరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహేష్‌కుమార్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జాతీయ నాయకులు అనిల్‌కుమార్ యాదవ్, తెలంగాణ ప్రయివేట్ జూనియర్ కళాశాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గౌరీ సతీష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాన్ని నిలదీద్దాం... నేటి ధర్నాకు రండి

సర్పంచులకు రేవంత్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సర్పంచుల సమస్యలపై నిరసన గళం వినిపిద్దాం... సోమవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు రండి' అంటూ పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. కోర్టు సహకారంతోధర్నాకు అనుమతి వచ్చిందని గుర్తు చేశారు. మన హక్కుల కోసం తరలిరావాలనీ, ప్రభుత్వం దిగివచ్చేలా పోరాడుతాం రండి అని విజ్ఞప్తి చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

చాతుర్వర్ణ వ్యవస్థే బిజెపి లక్ష్యం

- మనుస్మృతి అమలు కోసం ఎత్తుగడలు
- ప్రజల మధ్య విద్వేషాలతో రాజకీయ లబ్ధి
- సమస్యలన్నింటినీ పక్కదోవ పట్టిస్తున్న వైనం
- ప్రజలకు చైతన్యం కల్పించాల్సిన ఆవశ్యకత కమ్యూనిస్టులపై ఉంది
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో చాతుర్వర్ణ వ్యవస్థను తీసుకొచ్చి దేశాన్ని పురోగమనంవైపు నడిపే లక్ష్యంతో బిజెపి ముందుకెళ్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. దేశంలోని సమస్యలను గాలికొదిలేసి ప్రజల మధ్య విద్వేషాలను, మత ఘర్షణలను రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి పొందుతోందన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలనే ఎత్తుగడతో ముందుకు సాగుతున్న తీరును వివరించారు. హైదరాబాద్‌లో ఆదివారం నవతెలంగాణ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేసేందుకు బిజెపి శతవిధాలా ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. దీన్ని ప్రజాస్వామిక వాదులందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ మేలు జరిగే సమసమాజం రావాలని కమ్యూనిస్టులు పోరాడుతుంటే.. బిజెపి మాత్రం ప్రజలను కుల, మత విభేదాలతో చీల్చి దేశాన్ని తిరోగమనం వైపు నడిపే చాతుర్వర్ణ వ్యవస్థను అమలు చేయడం కోసం పనిచేస్తున్న తీరును వివరించారు. గతంలోనే భారత రాజ్యాంగం చెత్త అని గోల్వాల్కర్ అనగా, మనుస్మృతి ఉండగా రాజ్యాంగం గురించి చర్చే అవసరం లేదని జనసంఘ్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పుడు వారే రాజ్యాంగంపై కపట ప్రేమను చూపుతున్నారన్నారు. రోజువారీగా ప్రజలు చేసే ప్రతిపనిలోనూ, రాజకీయాల్లోనూ విద్వేషాలతో తన భావజాలాన్ని ఎక్కిస్తున్న తీరును నిలదీశారు. చివరకు చిన్నపిల్లల మెదళ్లల్లోనూ విషభావజాలాన్ని ఎక్కిస్తున్న తీరుపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై నేరుగా కాకుండా ఒక్కో వ్యవస్థను నిర్వీర్యం చేసుకుంటూ మోడీ సర్కారు ముందుకెళ్తోందని విమర్శించారు.

పార్లమెంట్‌లో అసమర్ధ పాలన అంటేనే తట్టుకోలేని పరిస్థితిలో బిజెపి ఉందన్నారు. రాష్ట్రాల హక్కులను మోడీ సర్కారు హరిస్తోందని చెప్పారు. దేశంలో లౌకిక విలువలు, ఆర్థిక స్వాలంబన, సామాజిక న్యాయం, ఫెడరల్ వ్యవస్థలపై దాడి తీవ్రమైందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. కట్టడి చేయకపోతే దేశంలో ప్రశ్నించే గళాలలను మరింత అణచివేసే అవకాశముంటుందని హెచ్చరించారు. ప్రజలకు చైతన్యం కల్పించాల్సిన బాధ్యత అందరి కంటే ఎక్కువగా కమ్యూనిస్టులపైనే ఉందని నొక్కి చెప్పారు. దేశాన్ని రక్షించుకునేందుకు బిజెపిని పాతరేయాలన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేయాల్సిన అవసరముందని, ఆ దిశగా కేరళ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. బిజెపి వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతరాములు, నవతెలంగాణ సిజిఎం పి ప్రభాకర్, ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్, బుక్‌హౌజ్ ఎడిటర్ కె ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.

యాకమ్మ, మోహన్‌రావుకు పురస్కారాలు అందిస్తున్న డాక్టర్ జయధీర్

యాకమ్మ, మోహన్‌రావుకు రత్నశ్రీ స్మారక పురస్కారాలు

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు సాహిత్యంలో వివిధ వాదాలు సామాజిక చైతన్యం కోసం ఆవిర్భావించాయని వీటిలో దళిత వాదం ఒక ఉద్యమంలా సాగుతోందని ప్రముఖ జానపద పరిశోధకులు డాక్టర్ జయధీర్ తిరుమలరావు అన్నారు. దళిత సాహితీ కారులు యాకమ్మ, మోహన్‌రావు ఆ సాహిత్య ప్రక్రియలో విశేష కృషి చేశారని అభినందించారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎంవిఆర్ ఫౌండేషన్ కవన వేదిక సంయుక్త నిర్వహణలో డాక్టర్ నందివాడ రత్న శ్రీ స్మారక పురస్కార ప్రదనోత్సవ్ జరిగింది. కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉన్నతాధికారి సుధీర్ కుమార్ అధ్యక్షత వహించిన సభలో ఆచార్య తిరుమలరావు ముఖ్య అతిథిగా పాల్గొని రత్నశ్రీ స్మారక పురస్కారాలు మోహనరావు, యకమ్మ కు బహుకరించి మాట్లాడారు. రత్నశ్రీ తెలుగు సాహిత్యంలో చేసిన కృషిని గుర్తింపుగా ఆమె పేరిట పురస్కారం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. వేదికపై జర్నలిస్ట్ చీకోలు సుందరయ్య, కవయిత్రి ఇనాంపూడి శ్రీ లక్ష్మి, నందివాడ భీమారావు తదితరులు పాల్గొనగా రఘుశ్రీ స్వాగతం పలికారు

సుశీలను సత్కరిస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు

సుశీలను భారత రత్నగా గుర్తించాలి

- జస్టిస్ రామలింగేశ్వర రావు

ప్రజాశక్తి - కల్చరల్

తరాలు మారవచ్చు ఏళ్లు గడవవచ్చు కానీ సుశీల, ఘంటసాల పాటలు శాశ్వతంగా నిలిచివుంటాయని సమైఖ్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు అన్నారు. సుశీలను కేంద్రం భారత రత్నగా గుర్తించాలని జస్టిస్ కోరారు. శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నాద వినోద సంగీత అకాడెమీ నిర్వహణలో సుశీల గాయనిగా డెబ్బై వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఆమెకు సత్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ రామ లింగేశ్వర రావు పాల్గొని సుశీలను సత్కరించారు. సుశీల మాట్లాడుతూ బిరుదులు అవసరం లేదని వార్ధక్యంలో ఆర్థికంగా ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ వేణు గోపాలాచారి మాట్లాడుతూ సుశీల తెలుగు భాషను స్పష్టంగా పలుకుతూ పాడేవారని నేడు తెలుగు భాషను ఎంత అపసవ్యంగా మాట్లాడితే వారే గొప్ప గాయకులు అని అన్నారు. అధ్యక్షత వహించిన సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పర్వతీశం మాట్లాడుతూ సుశీల స్వరం తెలుగువారికి వరం అన్నారు. ఆకాశవాణి గాయకులుగా ఘంటసాల సుశీల వారి గాన ప్రస్థానం ఆరంభించారని గుర్తు చేశారు. కిన్నెర రఘురాం స్వాగతం పలికిన సభలో బోగరాజు మూర్తి తదితరులు పాల్గొన్నారు. వేదికపై అమెరికా నుంచి వచ్చి ఐదు రోజులు పాటల విభావరిని సహగాయకులతో పాడిన మణి శాస్త్రిని సుశీల హు సత్కరించారు.

యాదగిరిగుట్టపైకి ఆటోలను అనుమతించాలి

- అడ్డా స్థలాలు కేటాయించాలి
- ఆర్‌టిసిని పరిరక్షించాలి
- పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్
- జాతీయ ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్
- వాహనాలతో భారీ ర్యాలీ, బహిరంగ సభ

సభలో మాట్లాడుతున్న జాతీయ ఉపాధ్యక్షులు వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదగిరిగుట్ట పైకి ఆటోలకు అనుమతించాలని, గుట్టపైకి వచ్చే వేలాది మంది భక్తులకు రవాణా సౌకర్యం కోసం కారు, ఆటోలకు అడ్డా స్థలాలు కేటాయించాలని పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జాతీయ ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలపై చేపట్టిన కార్మిక సంఘర్ష యాత్ర 8వ రోజైన ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం చేరుకుంది. ఈ సందర్భంగా వడాయిగూడెం చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ దగ్గర బహిరంగ సభ నిర్వహించారు. అక్కడినుంచి భువనగిరి పట్టణానికి చేరుకున్న యాత్రకు పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి రైతు బజార్ వరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించి కార్ల అడ్డా వద్ద సభ నిర్వహించారు. అక్కడినుంచి సాయంత్రం జనగామ జిల్లాకు యాత్ర చేరుకుంది. జనగామ పట్టణంలోని కళ్లెం రోడ్డు కమాన్ నుంచి వందలాది వాహనాలతో ర్యాలీగా వెళ్లి మంగళ హారతులు ఇచ్చి యాత్రకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అక్కడే సభ నిర్వహించారు. అక్కడి నుంచి హన్మకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్‌కు యాత్ర చేరుకోగా.. ట్రాన్స్‌పోర్టు కార్మికులు ఘనంగా స్వాగతం పలికారు. కాజీపేట మండలం మడికొండ, రాంపూర్‌తో పాటు హనుమకొండ డిపో రవాణా రంగ కార్మికుల సంఘర్షయాత్ర చేరుకోగా సిఐటియు నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వరగల్ జిల్లా కేంద్రానికి చేరుకోగా పోచమ్మ మైదాన్, కాశీబుగ్గ వద్ద నాయకులు స్వాగతం పలికి వరంగల్-1, వరంగల్-2 డిపోలకు ర్యాలీ నిర్వహించి, సభలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయా పట్టణాల్లో జరిగిన సభల్లో ఎస్ వీరయ్య, శ్రీకాంత్ మాట్లాడుతూ.. యాదాద్రి గుట్టపైకి 50 ఏళ్లకు పైగా ఆటోలను అనుమతించిన దేవస్థానం ధికారులు ఇప్పుడెందుకు అనుమతించడం లేదో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అందుబాటులో కార్మికులు కోరిన చోట ఆటో, కారులకు అడ్డా స్థలాలు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్వయం శక్తితో బతుకుతున్న 20 లక్షల మంది రవాణా కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, కార్మికులను ఆదుకోవడం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే నూతన మోటారు వాహన చట్టం-2019ని సవరించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండల, పట్టణ కేంద్రంలో ప్రజలకు అందుబాటులో అడ్డా స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2021 జూన్ 30న జిఒ 25 ద్వారా కనీస వేతనాన్ని రు.18,019 గాను, హైస్కిల్డ్ వర్కర్‌కు రూ.39,837గా నిర్ణయించారన్నారు. కానీ ప్రయివేటు యాజమాన్యాల ఒత్తిడి మూలంగా ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని గెజిట్‌లో పెట్టి కనీస వేతనాన్ని అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి యాక్ట్ 1950 ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 1:2 రేషియోలో మూలధన పెట్టుబడి ఆర్‌టిసిలకు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రవాణారంగ కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావు మాట్లాడుతూ.. ఆర్‌టిసి సంస్థను పరిరక్షించాలని, కార్మిక సంఘాలపై పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులకు రావాల్సిన రెండు పిఆర్‌సిలు, సిసిఎస్, పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించి ఆర్‌టిసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులు రాత్రి ఎనిమిది గంటలలోపు దిగే డ్యూటీలను వేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ఈ యాత్రలో ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుందాం

- విజ్ఞాన దర్శిని కార్యక్రమంలో ప్రజాస్వామికవాదులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భావప్రకటనా స్వేచ్ఛ హక్కును కాపాడుకుందామని విజ్ఞానదర్శిని సమావేశం తీర్మానించింది. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞానదర్శినీ కన్వీనర్ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాస్వామికవాదులు తదితరులు పాల్గొన్నారు.రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును కాపాడుకోవడం పౌరులందరి బాధ్యత అని సమావేశం అభిప్రాయపడింది. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా మాట్లాడినా ప్రవర్తించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప ఎవరూ చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని కోరింది. ఎవరు ఎవరిపైనా దాడులకు పాల్పడరాదని ఆకాంక్షించింది. రాష్ట్రంలో మతాన్ని అడ్డుపెట్టుకుని అధికారంలోకి రావాలని ఆరాటపడుతున్న మతోన్మాద రాజకీయ శక్తులు ఆడుతున్న రాజకీయ వికృత క్రీడలో భాగంగానే హేతువాదులు, నాస్తికులు, బహుజనులపై దాడులు జరుగుతున్నాయంటూ పేర్కొంది. ఆ దాడులను ఖండించింది. హేతువాదం, నాస్తికత్వం, భౌతికవాదం చార్వాకులు, లోకాయతులు, బుద్ధుడి నుంచి మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, భగత్ సింగ్ అందించిన భారతీయ తాత్విక వారసత్వమని స్పష్టం చేసింది. "మానవ మనుగడ పురోగమనానికి మూలం ప్రశ్నించే తత్వం. ప్రశ్న లేకపోతే మానవ ప్రగతి లేదు. ఆ ప్రశ్ననే దాడులకు గురవుతున్నది. హత్య చేయబడుతున్నది. భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే బాధ్యతను గుర్తు ఎరిగిన ప్రజాతంత్ర వాదులు, ప్రజా, పౌర సంస్థల ప్రతినిధులు అందరం రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా కృషి చేస్తాం. ఇందుకోసం రాజ్యాంగబద్ధంగా, చట్ట ప్రకారంగా మా కార్యాచరణ ఉంటుంది. చట్ట వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు తీసుకోవాలి. న్యాయస్థానాల తీర్పు ప్రకారం వ్యవహరించాలి. దానికి విరుద్ధంగా దాడులకు పాల్పడడం చట్ట వ్యతిరేకమే కాక రాజ్యాంగ వ్యతిరేకం..... " అని సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నో ఏళ్లుగా నాస్తికత్వాన్ని ప్రచారం చేస్తున్న బైరి నరేష్‌పై, పాటలు పాడుతున్న రేంజర్ల రాజేష్‌పై మతోన్మాదం, మనువాదుల దాడులను సమావేశం ఖండించింది. నిజామాబాద్ జిల్లా బోధన్ ప్రాంతంలోని కోటగిరి గ్రామంలో పాఠశాలలో పనిచేస్తున్న దళిత టీచర్ మల్లికార్జున్ ను అత్యంత దారుణంగా అవమానించి, తన నమ్మకాలకు విరుద్ధంగా గుడిలోకి తీసుకెళ్లి బలవంతంగా క్షమాపణలు చెప్పించి బొట్టుపెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించి చట్టాన్ని ఉల్లంఘించి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. టీచర్ మల్లికార్జున్ పై జరిగిన దాడిని సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, పీఓడబ్ల్యు సంధ్య, సామాజిక కార్యకర్త దేవి తదితరులపై మతోన్మాదులు చేస్తున్న దాడులను సమావేశం ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టింగ్‌లు పెడుతూ, వారి ఇండ్లపై దాడి చేయడం సరి కాదని తెలిపింది. భావప్రకటనా స్వేచ్ఛ హక్కుకు విరుద్ధంగా తానే తీర్పులు చెప్పే విధంగా వ్యవహరించి అరాచకశక్తులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడేలా చేసిన మీడియాపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో సిపిఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు అద్దంకి దయాకర్ (కాంగ్రెస్), పాండురంగాచారి (సిపిఐ), చలపతిరావు (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), హన్మేష్ (సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా), డాక్టర్ జిలకర శ్రీనివాస్ (ద్రావిడ బహుజన సమితి పార్టీ), కొమ్ముల శ్రీనివాస్ (డీఎంకె పార్టీ), ప్రొఫెసర్లు హరగోపాల్, కాశీం, సురేపల్లి సుజాత, కవి జయరాజ్, టి.వి.రావు (జనవిజ్ఞాన వేదిక), జీడి సారయ్య (భారత నాస్తిక సమాజం), రషీద్ (భారత నాస్తిక సమాజం), రాజకీయ పార్టీల మహిళా, విద్యార్థి, యువజ, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫలించిన గురుకుల పాఠశాల విద్యార్థినుల పోరాటం

- ప్రిన్సిపల్, వాచ్‌మెన్ తొలగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్న ప్రిన్సిపల్, వార్డెన్, అటెండర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు చేస్తున్న పోరాటం ఫలించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా దుమాల గ్రామంలో ఏకలవ్య గురుకుల పాఠశాల (బాలికలు) ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి, వాచ్‌మెన్ రామస్వామిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్టు కరీంనగర్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్ రీజినల్ కో ఆర్డినేటర్ డిఎస్ వెంకన్న ప్రకటించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రామారావుకు ప్రిన్సిపల్‌గా పూర్తి అదనపు బాధ్యతులు తీసుకోనున్నారు. గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, వార్డెన్, వాచ్‌మెన్ తమను వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కామారెడ్డి - సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ఆహారంలో పురుగులు, వానపాములు రావడంతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వార్డెన్, ప్రిన్సిపల్‌ను అడిగితే తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ప్రిన్సిపల్ అవినీతికి పాల్పడుతుందని, వాచ్‌మెన్ రామస్వామి మద్యం సేవించి తమపట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్నాడని, వార్డెన్ రమ్య ఇబ్బందులకు గురిచేస్తోందని చెప్పారు. దీనిపై విచారణ చేసి ప్రిన్సిపల్, వార్డెన్, వాచ్‌మెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ శేఖర్ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

- మూడవ రోజుకు చేరిన అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడేళ్లుగా తమకు రావాల్సిన జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న హాస్టల్ డైలీవేజ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె ఆదివారం మూడవరోజుకు చేరుకుంది. ఖమ్మం పట్టణంలోని ఎన్ఎస్పి రోడ్ గిరిజన హాస్టల్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు నర్రా రమేష్, కాంపాటి వెంకన్న మాట్లాడుతూ.. జీతాలు రాకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ జీతాలు ఇవ్వకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయం పేరుతో జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తే సోమవారం వారిని అడ్డుకుంటామని తెలిపారు.

మాస్టర్‌ప్లాన్‌పై.. మాటైనా చెప్పలే..

- ప్రజాభిప్రాయ సేకరణ గాలికి
- కామారెడ్డిలో ముదిరిన వివాదం
- రైతు ఐక్యకార్యాచరణ కమిటీ భేటీ
- 11న మున్సిపల్ కార్యాలయం ముట్టడికి తీర్మానం

తీర్మానానికి భేటీ అయిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌పై రగడ కొనసాగుతోంది. ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్ రద్దు చేసే వరకూ ఉద్యమం కొనసాగించాలని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం భేటీ అయ్యింది. ఈ నెల 11వ తేదీన కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముట్టడించాలని నిర్ణయించింది. కాగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో కనీస మార్గదర్శకాలు పాటించలేదని స్పష్టమయ్యింది. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండానే మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ విషయమై బాధిత రైతులను సంప్రదించగా.. తమకు కనీస సమాచారమైనా లేదని వాపోతున్నారు. మొత్తం 15,209 ఎకరాలతో కామారెడ్డి మాస్లర్‌ప్లాన్ ముసాయిదాను మున్సిపల్ అధికారులు విడుదల చేశారు. ఇందులో పారిశ్రామిక జోన్ కోసం ఏకంగా 1,195 ఎకరాలు, వాణిజ్య జోన్ 551 ఎకరాలు ప్రతిపాదించారు. అయితే పారిశ్రామిక జోన్ కోసం వ్యవసాయ భూములను సేకరిస్తున్నారని రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి పట్టణంతో పాటు విలీన గ్రామాలైన టెక్రియాల్, అడ్లూర్, రామేశ్వర్‌పల్లి, ఇల్చిపూర్, పాతరాజంపేట్, రామేశ్వర్‌పల్లి, సరంపల్లి, దేవునిపల్లి గ్రామాలను కలుపుకుని మున్సిపల్ అధికారులు కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదించారు. అయితే మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం 2015లో ఇచ్చిన మార్గదర్శకాలకు, టౌన్ ప్లానింగ్ యాక్ట్-1920కు తిలోదకాలిస్తూ ఈ మాస్టర్‌ప్లాన్ రూపొందించినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భాగస్వామ్య పక్షాలన్నింటినీ సంప్రదించి మాస్టర్‌ప్లాన్ రూపొందించాల్సి ఉన్నప్పటికీ.. కేవలం ఓ ప్రయివేటు కన్సల్టెంట్‌కు ఇచ్చి 'రియల్' భూమ్ లక్ష్యంగా ప్లాన్ రూపొందించినట్టు రైతులు విమర్శిస్తున్నారు. సాధారణంగా మాస్టర్ ప్లాన్ రీజినల్ డెవలప్‌మెంట్, జోనల్ డెవలప్‌మెంట్ ప్రణాళికలో ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటి? ఏమేమీ అభివృద్ధి చేయనుంది? ఏ ప్రాంతంలో ఏమీ నిర్మించనుంది? అనే ప్రతి విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాల్సి ఉన్నప్పటికీ.. కామారెడ్డిలో అవేమీ జరగలేదు. పైగా ప్రజల అభ్యంతరాలను స్వీకరించలేదు. ఇదే ప్రస్తుతం పెద్ద ఉద్యమంగా మారింది. వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న రైతులకు.. వ్యవసాయ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్లాన్ రూపొందించడంపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. పైగా మాస్లర్‌ప్లాన్ ముసాయిదాను సైతం బాధిత(విలీన) గ్రామాల్లో ఎక్కడా ప్రదర్శించలేదు. కాగా, మ్యాప్‌తో పాటు ప్రజలకు అర్థం అయ్యే విధంగా ప్రణాళికలను స్థానిక భాషల్లో రాస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయాలి. కానీ అది కూడా జరగలేదు. ముసాయిదా రూపొందించే సమయంలోనే అభ్యంతరాలను స్వీకరించి దానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలి. అలాగే ముసాయిదా విడుదలయిన తర్వాత కూడా తుది ఆమోదానికి ముందు మళ్లీ అభ్యంతరాలు స్వీకరించాలి. ఆ అభ్యంతరాలపై బాధితులతో సంప్రదించాలి. అయితే కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ ముసాయిదా మాత్రమేనని, మార్పులు చేర్పులు చేస్తామని జిల్లా కలెక్టర్‌తో పాటు అధికార పార్టీ నాయకులు అంటున్నారు. పైగా కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. మాస్టర్‌ప్లాన్‌లో కన్సల్టెంట్ తప్పిదం చేసిందని ఆరోపించారు. అయితే తాము నెల రోజులుగా ఆందోళన చేస్తే ఈ విషయం ఎందుకు చెప్పలేదని రైతుల ప్రశ్నిస్తున్నారు. తమ దృష్టి మరల్చేందుకు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

11న మున్సిపల్ కార్యాలయం ముట్టడి..

మాస్టర్‌ప్లాన్ రద్దు చేసే వరకు ఉద్యమం ఆపబోమని రైతు కార్యాచరణ కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం భేటీ అయి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించింది. సోమవారం కౌన్సిలర్లకు వినతిపత్రాలు సమర్పించాలని, 11వ తేదీన మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టాలని నిర్ణయించింది.

నేడు హైకోర్టులో విచారణ?

కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ వ్యతిరేకిస్తూ రామేశ్వర్‌పల్లిలోని సుమారు 40 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశముంది. సహజ న్యాయానికి వ్యతిరేకంగా కనీసం తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించకుండా పిటిషనర్లకు సంబంధించిన 131, 129, 127 తదితర సర్వే నెంబర్లలోని వ్యవసాయ భూమిని ప్రతిపాదించినట్టు ఆరోపించారు.

ప్రభుత్వ భూముల్లో గ్రీన్, ఇండస్ట్రీ జోన్‌లు ఏర్పాటు చేయాలి - వెంకట్‌గౌడ్, కామారెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి

కామారెడ్డిలో ప్రభుత్వ భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. అలాగే అసైన్డ్ భూములు వందల ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నాయి. ఇప్పటికే చాలా చోట్ల తారుమారు చేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అలాంటి భూముల్లో గ్రీన్, ఇండస్ట్రీజోన్లు ఏర్పాటు చేయాలి. వ్యవసాయ భూములను రైతుల వద్ద నుంచి తీసుకోవడం సరికాదు. కామారెడ్డి పట్టణానికి అనుకొని ఉన్న ఆల్కహాల్ ఫ్యాక్టరీ భూములు ఈ విధంగానే అన్యాక్రాంతమయ్యాయి. ఒకప్పుడు రైతుల నుంచి సర్కారు సేకరించి ఇప్పుడు ప్రయివేటు వ్యక్తులకు విక్రయిస్తోంది. సుమారు 80 ఎకరాల వరకు ఉంది. ఈ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అలాగే మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన రింగ్‌రోడ్డు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా ఏర్పాటు చేశారు. దీన్ని మార్చాలి.

రద్దు చేయాల్సిందే : తిరుపతిరెడ్డి మాసిరెడ్డి (అడ్లూర్ ఎల్లారెడ్డి)

కొత్త మాస్టర్‌ప్లాన్‌లో అడ్లూర్‌ఎల్లారెడ్డిలో ఇండస్ట్రియల్ జోన్‌లో ప్రతిపాదించారు. దీనివల్ల మా వ్యవసాయ భూములు కోల్పోవాల్సి వస్తుంది. మేం వ్యవసాయం చేసుకుని జీవించేవాళ్లం. మా భూములు కోల్పేతే మా బతుకుదెరువు ఎలా?

కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన వివరాలు : జోన్ ఎకరాలు

రెసిడెన్షియల్ జోన్-	6728	
వాణిజ్య జోన్	551	
పరిశ్రమల జోన్	1195	
వాణిజ్య, పరిశ్రమల జోన్(మిక్స్‌డ్)	659	
పబ్లిక్ సెమీ పబ్లిక్ జోన్		
ప్రభుత్వ కార్యాలయాలు	627	
ఎడ్యూకేషన్ రీసెర్చ్	158	
మెడికల్, హెల్త్	2.14	
సామాజిక, సంస్కృతిక, మతపరమైన జోన్	23.8	
స్మశానవాటికలు	41	
బఫర్ జోన్	250	
రిక్రియేషనల్ (పార్కులు, మైదానాలు)	41.34	
రోడ్డు వెడల్పులు, ప్రస్తుత రోడ్లు		1428
మాస్టర్‌ప్లాన్‌లో కొత్త రోడు		296
రైల్వే స్టేషన్	85.57	
బస్ డిపో	55.37	
ట్రక్ టెర్మినల్	43.51	
చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు	770	
అభివృద్ధికి అనుకూలమైన భూమి	1109	
మొత్తం	15,209 ఎకరాలు	

జనవరి 10న సిఐటియు జెండావిష్కరణలు

- 18-22 వరకు 17వ జాతీయ మహాసభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తమ యూనియన్ 17వ జాతీయ మహాసభలు ఈ నెల 18-22 వరకు బెంగుళూరులో జరుగనున్నాయని, వాటి పురస్కరించుకుని ఈ నెల పదోతేదీన అరుణపతాకాలు ఎగురవేయనున్నట్టు సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ప్రకటించారు. ఆ మహాసభలను జయప్రదం చేయాలని కార్మికలోకానికి పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సిఐటియు అనుబంధ సంఘాలన్నీ పదోతేదీన జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. "దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కాపాడుకుందాం. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకుందాం. కార్మిక-కర్షక మైత్రి కొనసాగిస్తాం. మోడీ సర్కారు ఎనిమిదేళ్లుగా అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటాలను ముమ్మరం చేస్తాం. దేశాన్ని కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను, కార్మికులను చీల్చుతున్న ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతాం. దేశంలో శాంతిని నెలకొల్పేందుకు కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ముందుకు సాగుతాం" అని ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పథకం ఎల్‌టి 4కు మారుస్తాం

- రజక వృత్తిదారుల సంఘం కేలండర్ అవిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉచిత విద్యుత్ పథకం ఎల్‌టి 4కు మారుస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ముద్రించిన కేలండర్‌ను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా వృత్తిదారుల సమస్యలను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య మంత్రికి వివరించారు. ఉచిత విద్యుత్ పథకం ఎల్‌టి 2లో ఉండటం వల్ల యుడిసి చార్జీలు, సర్ చార్జీలు, యూజర్ చార్జీల భారం పడుతోందని తెలిపారు. మరో పక్క బిల్లులు చెల్లించాలంటూ సంబంధిత అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. రజకుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చినటువంటి జిఒలను తెలంగాణ ప్రభుత్వానికి మార్పులు చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ.. ఉమ్మడి రాష్ట్రంలో రజకుల సంక్షేమం కోసం తీసుకొచ్చిన జిఒలను తెలంగాణకు మారుస్తామని తెలిపారు. విద్యుత్ బిల్లులు రజకులు చెల్లించాల్సిన అవసరంలేదని విద్యుత్తు అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కొండపాక ఎంపిపి ర్యాగల సుగుణ దుర్గయ్య, సిద్దిపేట స్థానిక కౌన్సిలర్ భుంపల్లి శ్రీహరి, రాష్ట ఉపాధ్యక్షులు ఎం బాలకృష్ణ, రాష్ట్ర సహాయ కార్య దర్శులు సి మల్లేష్, జ్యోతి పాల్గొన్నారు.

తెలంగాణ పట్టణాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- హైదరాబాద్, వరంగల్‌కు ప్రత్యేక ప్యాకేజీ
- కేంద్రానికి మంత్రి కెటిఆర్ లేఖ
- తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని పట్టణాలకు నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కెటిఆర్ ఆదివారం కేంద్రానికి లేఖ రాశారు. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని ఇతర పట్టణాలభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించాలని కోరారు. గతంలో అనేక సార్లు కేంద్రానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశామన్న కెటిఆర్.. మరోసారి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రతిపాదనలు పంపిన ప్రతిసారి తెలంగాణకు నిరాశే ఎదురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణాల అభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని.. తమ ప్రయత్నానికి తోడ్పాటు అందించేందుకు వచ్చే బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. హైదరాబాద్, వరంగల్ లాంటి పట్టణాలకు ఒక ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొన్నారు. తెలంగాణపై వివక్షతోనే కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అదనంగా ఒక్క రూపాయి కూడా నిధులు రాలేదని కెటిఆర్ అన్నారు. కేంద్రం మొండి చెయ్యి చూపినా.. అన్ని రంగాల్లో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి కనబరుస్తోందన్నారు. ముందుచూపు, దూరదృష్టితో సిఎం కెసిఆర్ తెచ్చిన పరిపాలనా సంస్కరణలతోనే పట్టణాలన్నీ సమగ్ర అభివృద్ధి చెందాయని తెలిపారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అవార్డులు, రివార్డులే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా తమ ప్రభుత్వ పనితీరును మోదీ సర్కార్ గుర్తించి, నిధులు కేటాయిస్తారన్న నమ్మకంతో తాను ఈ లేఖ రాస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. 47శాతం రాష్ట్ర జనాభా పట్టణాల్లో నివసిస్తున్నందున అన్ని రంగాల్లో వాటిని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు. ఇందుకోసమే నూతన మున్సిపల్ చట్టం, నూతన భవన నిర్మాణ అనుమతుల చట్టం, ప్రతి పట్టణం కచ్చితంగా ఖర్చు చేయాల్సిన 10శాతం గ్రీన్ బడ్జెట్, టిఎస్‌బిపాస్ వంటి విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మెట్రో ప్రాజెక్టుకు ఆర్థిక మద్దతు ఇవ్వాలి..

భవిష్యత్ అంచనాలు, అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలోని 68 పురపాలికలను 142కు పెంచుకున్నామని లేఖలో కెటిఆర్ ప్రస్తావించారు. భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎయిర్ పోర్ట్ ఎక్స్ ప్రెస్ మెట్రో ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిందని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.6,250 కోట్ల బడ్జెట్‌తో 31కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కోరారు. ఈ ప్రాజెక్టుకి కేంద్రం ఆర్థికంగా మద్దతు ఇచ్చే విషయాన్నీ పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో రూ.3,050 కోట్ల వ్యయంతో 20 కి.మీ. మేర మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ నిర్మాణం చేపడుతున్నామని.. అందులో 15శాతం మూలధనం పెట్టుబడిగా రూ.450 కోట్లు కేటాయించాలన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ కోసం కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ రూ.254 కోట్ల బకాయిలు ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని కోరారు. తెలంగాణలోని పురపాలికల్లో రూ.3,777 కోట్ల బడ్జెట్‌తో చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయో మైనింగ్ ప్రాజెక్టుల నిమిత్తం 20శాతం అంటే రూ.750 కోట్లు కేంద్రం బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. హైదరాబాద్ నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం రూ.400కోట్లు స్వచ్ఛ్ భారత్ మిషన్ నిధులు కేటాయించాలని.. హైదరాబాద్ ప్రభుత్వం చేపట్టిన లింకు రోడ్ల నిర్మాణంతో మంచి ఫలితాలు, ప్రధాన రోడ్లపై భారీగా ట్రాఫిక్ తగ్గిందన్నారు. రూ.2400 కోట్లతో చేపట్టే 104 లింక్ రోడ్ల నిర్మాణ బడ్జెట్‌లో మూడో వంతు రూ.800 కోట్ల కేంద్ర ప్రభుత్వం భరించాలన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, మూసీ నది ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఈస్ట్ వెస్ట్ ఎక్స్ ప్రెస్‌వే కోసం రూ.11,500 కోట్లు, ఎస్ఆర్‌డిపి రెండవ దశ రూ.14,000 కోట్లు, డెవలప్‌మెంట్ ఆఫ్ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, స్కై వేల నిర్మాణం కోసం రూ.9,000 కోట్లు మొత్తంగా అయ్యే రూ.34,500 కోట్లల్లో కనీసం పదిశాతం అంటే రూ.3,450 కోట్లు కేంద్రం ఈ బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. పట్టణాల అభివృద్ధికి ముఖ్యంగా హైదరాబాద్ మహానగర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను శీఘ్ర గతిన అమలు చేయడం కోసం పరిపాలనాపరమైన ఏర్పాట్లను చేసుకున్న విషయాన్ని లేఖలో కేటీఆర్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మానసపుత్రిక అయిన హరితహారంతో హైదరాబాద్ నగరానికి వరల్డ్ గ్రీన్ సిటీగా అవార్డు లభించిందన్న కెటిఆర్.. మన దేశం నుంచి హైదరాబాద్ నగరానికి మాత్రమే ఆ గుర్తింపు దక్కిన విషయాన్ని లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో తమ ప్రభుత్వ సంకల్పంతో హైదరాబాద్ అభివృద్ధి చెందడంతో పాటు అంతర్జాతీయ గుర్తింపు సైతం లభిస్తోందని వివరించారు. దేశ గౌరవ, ప్రతిష్ఠలను విశ్వవేదికలపై సగర్వంగా నిలబెడుతున్న బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత మోదీ ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ పట్టణాల అభివృద్ధికి కావాల్సిన వివిధ ప్రతిపాదనలు, విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచామని, కనీసం ఈ బడ్జెట్ లోనైనా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కెటిఆర్ కోరారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణ పట్టణాల అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని కెటిఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు చలో ప్రగతి భవన్

- పోలీసు అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి
- ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సోమవారం చలో ప్రగతి భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎఐవైఎఫ్ కార్యాలయంలో యువజన, విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, నిర్లకంటి శ్రీకాంత్ (ఎఐవైఎఫ్), కోట రమేష్, అనగంటి వెంకటేష్ (డివైఎఫ్ఐ), సలీం పాషా (వైజెఎస్), లక్ష్మణ్, రెహ్మాన్, ఉదయ్ (ఎఐఎస్ఎఫ్), అరుణ్ కుమార్ (విజెఎస్) మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ (టిఎస్ఎల్‌పిఆర్‌బి) నిర్వహించిన దేహదారుఢ్య అర్హత విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు అర్హత పొందారని తెలిపారు. బోర్డు చైర్మన్ తప్పుడు నివేదిక విడుదల చేశారని విమర్శించారు. గతంలో ఈవెంట్స్ విభాగాలలో 87 శాతం మంది అభ్యర్థులు ఉతీర్ణత సాధించారని చెప్పిన అధికారి, ఇప్పుడేమో 53.7 శాతం మంది మాత్రమే అర్హత పొందారని చెప్పడం హేయమైన చర్య అని విమర్శించారు.

చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలతో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆకాంక్షలతో పోలీసు ఉద్యోగాన్ని పొందాలనే అభ్యర్థులకు ఆయన చేసిన ప్రకటన నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు. రన్నింగ్ విభాగంలో అర్హత సాధించిన అభ్యర్థులకు సివిల్, కమ్యూనికేషన్, ఫైర్, జైల్, ఎక్సైజ్ విభాగాల్లో మెయిన్స్ పరీక్షకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రిలిమ్స్ పరీక్షలలో తప్పుగా వచ్చిన ప్రశ్నలకు మార్కులను కలపాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయని చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలనీ, కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ఇప్పటికే అనేక రోజులుగా అభ్యర్థులు వివిధ రూపాల్లో న్యాయం కోసం పోరాటం చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం లో చలనం రాలేదని విమర్శించారు. సిఎం కెసిఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

- ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా కట్టంగూరులో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. కట్టంగూరు మండలంలోని యరసానిగూడెం వద్ద వేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నార్కట్‌పల్లి కామినేని దవాఖానకు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కట్టంగూరు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను ఖమ్మం జిల్లా ఖిల్లాబజార్ వాసులుగా గుర్తించారు. హైదరాబాద్‌లో వివాహానికి హాజరై ఖమ్మం తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారత కోసం గీతాముఖర్జీ కృషి

- మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పార్లమెంట్‌లో కొట్లాడిన నేత
- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా సాధికారత, ఉపాధి, నిరక్షరాస్యత నిర్మూలన, మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప పోరాటయోధురాలు గీతాముఖర్జి అని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌బహదూర్‌గౌర్ హాల్‌లో గీతాముఖర్జీ శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ.. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఏడుసార్లు ఎంపిగా పనిచేశారని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టం చేయాలని తన మంత్రి పదవిని పరిత్యజించారని గుర్తు చేశారు. మహిళలు కుటుంబ, సాంఘిక, రాజకీయ హక్కులను కలిగినప్పుడు మహిళల మనుగడ అభివృద్ధి సాధ్యమని ఆనాడే ఆమె కొట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసి సాంఘిక, ఆర్థిక రంగాలలో మార్పు కోసం విస్తృతమైన పోరాటాలను ఆమె చేశారని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పార్లమెంట్లో ఆమె చేసిన వాదనలు, పోరాటం దేశవ్యాప్తంగా మహిళలకు ఉత్తేజాన్ని నింపిందన్నారు. నేడు మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా, మహిళా సమస్యల పరిష్కారం కోసం ఆమె స్ఫూర్తితో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు సృజన, ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి, ఎఐవైఎఫ్ జాతీయ. కార్యదర్శి ఎం.అనిల్, రాష్ట్ర అధ్యక్షులు వలి, నాయకులు గోవింద్, దశరథ్, శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ కరుణ కుమారి, నాయకులు ఎమ్‌డీ ఫైమిదా, జ్యోతిశ్రీమాన్, రొయ్యల గిరిజ, ఉజ్జిని హైమావతి, కమల, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దంగల్..దమ్మున్న క్రీడ : ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దంగల్ అంటే దమ్మున్న క్రీడ అని, క్రీడాకారులను సిఎం కెసిఆర్ ఎప్పుడూ ప్రోత్సహిస్తారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఎల్బీ స్టేడియంలో 51వ సీనియర్ నేషనల్ ఇండియన్ స్టైల్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. 85 కిలోల మహిళల రెజ్లింగ్ టైటిల్ మ్యాచ్‌ను కవిత వీక్షించారు. అనంతరం విజేత, రన్నరప్‌గా నిలిచిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెజ్లింగ్ ఎంతో ప్రాచీనమైన క్రీడ అని, ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో రెజ్లింగ్‌లో ఎక్కువ పతకాలు వచ్చాయన్నారు. విజయ్‌కుమార్ యాదవ్ గౌరవార్థం జరుగుతున్న పోటీలకు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. రెజ్లింగ్ అంటే బలమే కాదని, తెలివి, టెక్నిక్, స్పీడ్‌ను ప్రదర్శించే క్రీడ అన్నారు. కుస్తీ పోటీలకు తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

కెసిఆర్ సూచనలతో ఎపి అభివృద్ధి చేస్తాం

- బిఆర్ఎస్ ఎపి అధ్యక్షుడు చంద్రశేఖర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ సూచనలతో ఎపిని అభివృద్ధి చేస్తామని బిఆర్ఎస్ పార్టీ ఎపి అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా గంగుల మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గత 15 సంవత్సరాల కిందట కరీంనగర్‌కు వచ్చానని, అప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయన్నారు. కరీంనగర్ అంతా పచ్చదనంతో నిండిపోయిందని, ఎటుచూసినా నీరే కనిపిస్తుందన్నారు. కెసిఆర్ చేసిన అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమని, ప్రత్యేక చొరవతో తెలంగాణను అభివృద్ధి చేశారని, దాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం కలిగిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రాప్ హాలిడే డిక్లేర్ చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇక్కడ పంటలు బాగా పండుతున్నాయని చెప్పారు.

భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుందాం

- విజ్ఞాన దర్శిని కార్యక్రమంలో ప్రజాస్వామికవాదులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భావప్రకటనా స్వేచ్ఛ హక్కును కాపాడుకుందామని విజ్ఞానదర్శిని సమావేశం తీర్మానించింది. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞానదర్శినీ కన్వీనర్ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాస్వామికవాదులు పాల్గొన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును కాపాడుకోవడం పౌరులందరి బాధ్యత అని సమావేశం అభిప్రాయపడింది. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడినా, ప్రవర్తించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలేగానీ, చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని కోరింది. ఎవరిపైనా ఎవరు దాడులకు పాల్పడరాదని ఆకాంక్షించింది. రాష్ట్రంలో మతాన్ని అడ్డుపెట్టుకొని అధికారంలోకి రావాలని ఆరాటపడుతున్న మతోన్మాద రాజకీయ శక్తులు ఆడుతున్న రాజకీయ వికృత క్రీడలో భాగంగానే హేతువాదులు, నాస్తికులు, బహుజనులపై దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. ఆ దాడులను ఖండించింది. "మానవ మనుగడ పురోగమనానికి మూలం ప్రశ్నించే తత్వం. ప్రశ్న లేకపోతే మానవ ప్రగతి లేదు. ఆ ప్రశ్ననే దాడులకు గురవుతున్నది. హత్య చేయబడుతున్నది.

భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే బాధ్యతను గుర్తు ఎరిగిన ప్రజాతంత్ర వాదులు, ప్రజా, పౌర సంస్థల ప్రతినిధులు అందరం రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా కృషి చేస్తాం. ఇందుకోసం రాజ్యాంగబద్ధంగా, చట్ట ప్రకారంగా మా కార్యాచరణ ఉంటుంది. చట్ట వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు తీసుకోవాలి. న్యాయస్థానాల తీర్పు ప్రకారం వ్యవహరించాలి. దానికి విరుద్ధంగా దాడులకు పాల్పడడం చట్ట వ్యతిరేకమే కాక రాజ్యాంగ వ్యతిరేకం..... " అని సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నో ఏళ్లుగా నాస్తికత్వాన్ని ప్రచారం చేస్తున్న బైరి నరేష్‌పై, పాటలు పాడుతున్న రేంజర్ల రాజేష్‌పై మతోన్మాదం, మనువాదుల దాడులను సమావేశం ఖండించింది. నిజామాబాద్ జిల్లా బోధన్ ప్రాంతంలోని కోటగిరి గ్రామంలో పాఠశాలలో పనిచేస్తున్న దళిత టీచర్ మల్లికార్జున్‌ను అత్యంత దారుణంగా అవమానించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, పీఓడబ్ల్యూ సంధ్య, సామాజిక కార్యకర్త దేవి తదితరులపై మతోన్మాదులు చేస్తున్న దాడులను సమావేశం ఖండించింది. ఈ సమావేశంలో సిపిఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు అద్దంకి దయాకర్ (కాంగ్రెస్), పాండురంగాచారి (సిపిఐ), చలపతిరావు (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), హన్మేష్ (సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా), డాక్టర్ జిలకర శ్రీనివాస్ (ద్రావిడ బహుజన సమితి పార్టీ), కొమ్ముల శ్రీనివాస్ (డిఎంకె పార్టీ), ప్రొఫెసర్లు హరగోపాల్, కాశీం, సురేపల్లి సుజాత, కవి జయరాజ్, టి.వి.రావు (జనవిజ్ఞాన వేదిక), జీడి సారయ్య (భారత నాస్తిక సమాజం), రషీద్ (భారత నాస్తిక సమాజం), రాజకీయ పార్టీల మహిళా, విద్యార్థి, యువజ, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.